క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



శివప్రసాద్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్లికార్జునరెడ్డి

పొన్నలూరు: వైఎస్సార్ సీపీ మండల నూతన అధ్యక్షుడిగా నియమితులైన దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి చేపట్టాల్సి కార్యక్రమాలపై చర్చించారు. అందరినీ సమన్వయం చేసి మండలంలో పార్టీని అభివృద్ధి చేయాలని శివప్రసాద్‌రెడ్డి సూచించారు. ఆయన వెంట పొన్నలూరు జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ప్రభాకర్‌శర్మకు ఘన సన్మానం



ప్రభాకర్‌శర్మను సన్మానిస్తున్న మండల పరిషత్ సిబ్బంది

పీసీపల్లి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తూ బదిలీపై కనిగిరి వెళుతున్న ప్రభాకర్‌శర్మను బుధవారం అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. డిప్యూటీ ఎంపీడీఓ రాంప్రసాద్, ఏపీఓ జహంగీర్ బాష, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యాయామ ఉపాధ్యాయుడు మృతి



రామారావు (ఫైల్)

పొన్నలూరు: స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు వలేటి రామారావు(52) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. రామారావు కొన్నేళ్లుగా కనిగిరి ప్రాంతంలో నివాసముంటు ప్రస్తుతం వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. అయితే బుధవారం ఒక్కసారిగా అనారోగ్యానికి గురై అపస్మారక స్థితిలోకి వెళ్లి గుండెపోటు రావడంతో మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



ఆలకూరపాడులో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

టంగుటూరు: మండలంలోని ఆలకూరపాడులో వచ్చే నెల 26న జరగనున్న జ్యోతిబా పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను బుధవారం సర్పంచ్ బిల్లా ఝాన్సీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో . పూలే అంబేద్కర్ విగ్రహ కమిటీ అధ్యక్షుడు ఉప్పుటూరి వెంకట్రావు, కంకణాల ఆంజనేయులు, శ్రీనివాసరావు, ఎండ్లూరి కొండలరావు, పులి కోటేశ్వరరావు, కొణిజేటి తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఏఓ సుధాకర్

సింగరాయకొండ: పంటల సాగులో విత్తనశుద్ధి వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ సుధాకర్ అన్నారు. మండలంలోని పాకల, సోమరాజుపల్లి రైతు సేవా కేంద్రాల ఆధ్వర్యంలో బుధవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు ఆధునిక పద్ధతిలో పంటల సాగుపై అవగాహన కల్పించారు. డ్రోన్ దీదీ అనే పథకంలో సబ్సిడీపై డ్రోన్ అందజేస్తారని, డ్రోన్ సాయంతో తక్కువ సమయంలో ఎక్కువ పొలంలో పురుగు మందులు పిచికారీ చేయవచ్చన్నారు. కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట సాగుదారు హక్కు పత్రంపై అవగాహన

కొండపి: కౌలు రైతులు పంట సాగుదారు హక్కు పత్రం తప్పనిసరిగా తీసుకోవాలని వ్యవసాయాధికారి డి.విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పంట సాగు హక్కుదారు పత్రంపై వ్యవసాయ సహాయకులకు రెవెన్యూ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తహసీల్దార్ పి.మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ సొంత భూమి కలిగిన రైతు పొలంపై కౌలు రైతుకు ఎటువంటి అధికారం ఉండదని, కేవలం ఆ భూముల సాగు చేసే పంట పైన మాత్రమే అధికారం కలిగి ఉంటుందన్నారు.

ఏడాది పాలనలోనే
ప్రభుత్వంపై తిరుగుబాటు

- కూటమి పాలనపై ప్రజా పోరాటం ఇక ఆగదు
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి
- ఉద్యమంలా సాగిన వెన్నుపోటు దినం
- కనిగిరిలో కదం తొక్కిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



కనిగిరి ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, దద్దాల నారాయణ యాదవ్, బన్నీ, రమణారెడ్డి, తిరుపతిరెడ్డి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు

కనిగిరిరూరల్:

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలోనే ప్రజల నుంచి తిరుగుబాటు ప్రారంభమైందని వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా.. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడాన్ని నిరసిస్తూ.. బుధవారం కనిగిరిలో కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ నమ్మి ఓట్లేసిన ప్రజలను చంద్రబాబు వెన్నుపోటు పొడిచారని తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రజా ఉద్యమంలా సాగిన వెన్ను పోటు దినం' నిరసన కార్యక్రమంలో ప్రజలు వేలాది సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. కూటమి పాలనకు వ్యతిరేకంగా ప్రజా పోరాటం ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైందని.. ఇక ఇది ఆగదన్నారు. పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఈసడించుకుంటున్నారన్నారు. చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలకు సున్నం పెట్టారని.. ఇచ్చిన హామీలను ఏ ఒక్కటీ అమలు చేయకుండా, ప్రతి పథకానికి వెన్నుపోటు పొడుస్తూ ప్రజలకు నిలువునా మోసం చేస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. పథకాలు అమలు చేయకుండా అక్రమ కేసులు బనాయిస్తూ.. డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నారని ఘాటుగా విమర్శించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటుకు సిద్ధమయ్యారని, ఇందుకు ఈ నిరసన ప్రదర్శనే నిదర్శనమన్నారు. తొలుత స్థానిక పామూరు రోడ్డులోని చైర్మన్ అబ్దుల్ గఫార్ ఇంటి వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ చర్చి సెంటర్, చెప్పుల బజార్, ఎమ్మెస్సార్ రోడ్డు, శ్రీనివాస మహల్ సెంటర్, వైఎస్సార్ రోడ్డు, పార్క్ మీదుగా ఆర్డీఓ ఆఫీసుకు చేరుకున్నారు. అనంతరం పార్టీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, చైర్మన్ అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీల సంఘం అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీలు కస్తూరిరెడ్డి, లక్ష్మీ కాంతం రెడ్డి, ఎంపీపీలు గంగసాని లక్ష్మీ హుసేన్‌రెడ్డి, గాయం సావిత్రి, పులి శాంతిగోవర్ధన్‌రెడ్డి, తమ్మినేని సుజాత, మాజీ ఏఎంసీ చైర్మన్ సీహెచ్ సాల్మన్‌రాజు, పార్టీ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, కేవీ వెంకటేశ్వర్లు, గంగసాని హుస్సేన్‌రెడ్డి, ఆవుల భాస్కర్ రెడ్డి, కటికల వెంకటరత్నం, ఓమోగా రామిరెడ్డి, డాక్టర్ రసూల్, సూరసాని మోహన్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డిలతో కలిసి ఆర్డీఓ బి.కేశవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్యాల జఘన్య, జెడ్పీటీసీలు చప్పిడి సుబ్బయ్య, ఓకే రెడ్డి, మాజీ ఎంపీపీలు గాయం బలరాంరెడ్డి, భువనగిరి వెంకటయ్య, పార్టీ మండల అధ్యక్షుడు జి. బొర్రారెడ్డి, యక్కంటి శ్రీనివాసులరెడ్డి, గజ్జల వెంకటరెడ్డి, యాదాల సాయి, గట్ల విజయభాస్కర్, పాలకొల్లు మల్లికార్జునరెడ్డి, కన్నమర్లపూడి లక్ష్మీ మోహన్ పాల్గొన్నారు.



కనిగిరిలో 'వెన్నుపోటు దినం' కార్యక్రమ ర్యాలీలో భారీగా పాల్గొన్న పార్టీ శ్రేణులు

ప్రశ్నించే గొంతులపై రెడ్‌బుక్ రాజ్యాంగం

- వెన్నుపోటుకు కేరాఫ్ బాబు, పవన్.
ఏడాది పాలనలో నమ్మించి నట్టేటన ముంచిన కూటమి ప్రభుత్వం.
- ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలకు తీరని అన్యాయం
- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు

కొండపి: వెన్నుపోటుకు కేరాఫ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఏడాదైనా హామీలు అమలు చేయకుండా మోసం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో సురేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సురేష్ మాట్లాడుతూ హామీల అమలుపై ప్రశ్నించే గొంతులను రెడ్‌బుక్ కుట్రలతో నొక్కేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలను నమ్మించి నట్టేట ముంచిందన్నారు. సూపర్ సిక్స్ సహా ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ గాలికి వదిలేశారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా పరిగణించి వెంటాడి..వేటాడి హత్యలు, హత్యాయత్నాలు దాడులతో భీతవాహ వాతావరణం సృష్టిస్తున్నారన్నారు. కొండపి మండలం పెద్దకళ్లగుంట సర్పంచ్‌పై దాడులు అక్రమ కేసులు, పెట్లూరు ఎస్సీలను రెచ్చగొట్టి పట్టా భూమిని ఆక్రమించి కట్టడాలు నిర్మించడం రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగమేనన్నారు. పాలన వైఫల్యాల నుంచి ప్రజలను దృష్టి మళ్లించేందుకు చంద్రబాబు ఎప్పటికప్పుడు డైవర్షన్ పాలిటిక్స్‌కు దిగుతున్నారన్నారు. పదో తరగతి పేపర్ల మూల్యాంకనాన్ని సక్రమంగా చేయలేక లక్షల మంది విద్యార్థుల జీవితాలతో మంత్రి లోకేష్ ఆటలాడుతున్నారని మండిపడ్డారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3000 ఇస్తామని హామీ ఇచ్చారని ఇప్పటివరకు ప్రవేశపెట్టిన బడ్జెట్లలో నిరుద్యోగుల సంక్షేమం కోసం ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తుంటే పోలీసులు ర్యాలీకి మైక్ పర్మిషన్ ఇవ్వకుండా అడుగడుగునా ఆటంకాలు కల్పించారన్నారు.

భారీ జన సందోహంతో ర్యాలీ..

తొలుత బస్టాండ్ సమీపంలోని పోలేరమ్మ తల్లి ఆలయంలో పూజలు చేసి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ ప్రారంభంలో పోలీసులు ప్లకార్డులకు అనుమతి లేదని, అలా ర్యాలీ చేస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. అయినా కేసులకు భయపడేది లేదని ర్యాలీ ప్రారంభించారు. ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తహసీల్దార్ కార్యాలయం వరకు పాల్గొన్నారు. ర్యాలీలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్, మాజీ కన్వీనర్ ఆరికట్ల వెంకటేశ్వర్లు, రావెళ్ల వెంకయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొనడానికి బయట మండలాల నుంచి వస్తున్న కార్యకర్తలను నిలువరించడానికి పోలీసులు కట్టవారిపాలెం రోడ్డు, బీసీ కాలనీల వద్ద వాహనాల తనిఖీ పేరుతో హడావుడి చేశారు. అయినా కార్యకర్తలు ఏమాత్రం బెదరకుండా భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పిచ్చిరెడ్డి, ఆరు మండలాల కన్వీనర్లు బచ్చల కోటేశ్వరరావు, సుబ్బారెడ్డి, చింతపల్లి హరిబాబు, మసనం వెంకట్రావు, పిన్నిక శ్రీనివాసులు, మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర ఇంటలెక్చువల్ ప్రధాన కార్యదర్శి బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, రాష్ట్ర యూత్ వింగ్ జోనల్ ప్రెసిడెంట్ మారెడ్డి వెంకటాద్రిరెడ్డి, రాష్ట్ర ఐటీ వింగ్ జోనల్ ప్రెసిడెంట్ మణికంఠేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం జాయింట్ సెక్రటరీ రామచంద్రారావు, మర్రిపూడి జెడ్పీటీసీ మాకినేని సుధారాణి వెంకట్రావు, పన్నలూరు జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదిమూలపు సురేష్, నేతలు

పెద్దమ్మతల్లి ఆలయంలో చెవిరెడ్డి పూజలు



సీఎస్‌పురంలో రాచూరి పెద్దమ్మతల్లి గ్రామోత్సవం



పూజల్లో ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ చెవిరెడ్డి

సీఎస్‌పురం(పామూరు): స్థానిక రాచూరి పెద్దమ్మతల్లి తిరునాళ్ల సందర్భంగా ఆలయంలో వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బుధవారం స్థానిక నాయకులతో కలిసి పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. పెద్దమ్మతల్లి గ్రామోత్సవం రాత్రి ఘనంగా సాగుతోంది. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, చెరుకుపల్లి రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు మితికాల గురవయ్య, బైరెడ్డి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ భువనగిరి వెంకటయ్య, సిద్దు వెంకటరెడ్డి, బసివి చంద్రశేఖర్, వేల్పుల నారాయణ, మేకల ఆంజనేయులు, మోరం మొరార్జి పలువురు పాల్గొన్నారు.

211 పొగాకు బేళ్లు తిరస్కరణ



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రంలో బుధవారం జరిగిన వేలంలో 211 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. ఆలకూరపాడు, రావివారిపాలెం, పాలేటిపాడు, జయవరం, అనంతవరం గ్రామాలకి చెందిన రైతులు 786 బేళ్లను తీసుకురాగా 575 బేళ్లను కొనుగోలు చేసి 211 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.190, సరాసరి ధర రూ.237.51గా నమోదైంది. వేలంలో 23 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

టంగుటూరు: వ్యాపారులు అన్ని గ్రేడ్లకు మంచి ధరలు ఇవ్వాలని రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక వేలం కేంద్రాన్ని పొగాకు బోర్డు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలుదారు రైతులను దృష్టిలో పెట్టుకొని మంచి ధరలు ఇవ్వాలన్నారు. వేలం మేనేజర్ రామాంజనేయులు, నిర్వహణాధికారి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



వేలాన్ని పరిశీలిస్తున్న రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు

అడవిలో మంటలు

ఉలవపాడు: మండల పరిధిలోని అలగాయపాలెం రోడ్డులోని అటవీ భూమిలో ఉన్న సరుగుడు చెట్ల తోటలో బుధవారం మంటలు వ్యాపించాయి. ప్రమాదవశాత్తు ఈ మంటలు వ్యాపించి కింద ఉన్న చెత్తకు నిప్పంటుకుంది. ఎండ అధికంగా ఉండడంతో సాయంత్రం వేళకు మంటలు రోడ్డుపైకి వ్యాపించడంతో స్థానికులు గమనించి మంటలను అదుపు చేశారు. అప్పటికే చెట్ల కింద ప్రాంతం మంటలకు దగ్ధమైంది.



మంటలు ఆర్పుతున్న స్థానికులు

కమనీయం కోదండరాముని కల్యాణం



కోదండరాముని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పొన్నలూరు: మండలంలోని చెన్నిపాడులో కోదండరామస్వామి తొమ్మిదో వార్షిక ఉత్సవాల్లో భాగంగా కోదండరాముని కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. గ్రామ పెద్దలు ఉభయదాతలుగా వ్యవహరించి స్వామిని నూతన పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రామనామస్మరణతో మారుమోగింది. గ్రామానికి చెందిన సంగమేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ బూచిరాజు మాల్యాద్రి, ఆదిలక్ష్మి దంపతులు స్వామి కల్యాణం సందర్భంగా సీతారామ, లక్ష్మణకు వెండి కిరీటాన్ని బహూకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం గ్రామోత్సవం కనులపండువగా సాగింది.



కిరీటాన్ని బహూకరిస్తున్న మాల్యాద్రి కటుంబ సభ్యులు

విద్యామిత్ర కిట్లను సద్వినియోగం చేసుకోవాలి

జరుగుమల్లి(సింగరాయకొండ): విద్యా మిత్ర కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్వశిక్షా అభియాన్ సీఎంఓ కె.సోని రూత్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యామిత్ర కిట్ల స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాల ప్రారంభించే నాటికి ప్రతి విద్యార్థి చేతిలో విద్యా మిత్ర కిట్లు తప్పనిసరిగా ఉండాలని ఆదేశించారు.



స్టాక్‌పాయింట్‌ను ఆకస్మిక తనిఖీ చేస్తున్న సర్వశిక్షా అభియాన్ సీఎంఓ